# 2. పైపంట

## 15 పంక్తుల సమాధాన ప్రశ్నలు

**1. 'పైపంట' నాటికలోని రైతు ఆర్థిక పరిస్థితులను తెలపండి.**

జ. రైతులు కష్టపడి పంటలు పండిస్తారు. అయితే రైతులు పండించిన పంటకు, సరియైన ధర రాదు. పంట పండగానే వారు ఆ ధాన్యాన్ని గ్రామంలోని షావుకారుకో, ధాన్యం కొనే కమీషన్‌దారుకో అమ్మకోవాలి. పేటలో 14 అణాలు అమ్ముతూ ఉంటే, కమీషన్‌దారు సగం ధరకే కొంటాడు. అప్పులు పెట్టే షావుకారు మరీ తక్కువ ధరకు కొంటాడు.

రైతులకు తాను అప్పులు ఇస్తూ ఉంటాడు కాబట్టి తనకే అమ్మాలని షావుకార్లు రైతులపై ఒత్తిడి తెస్తారు. కమీషన్‌దార్లు తక్కువ ధరకు రైతుల వద్దకొని, ఎక్కువకు అమ్మి మంచి లాభం గడిస్తారు.

ఇక గ్రామంలో మునసబు, కరణాలు కిస్తీలు కట్టమని రైతులను బాగా ఇబ్బంది పెడతారు. కట్టడం ఆలస్యం అయితే, రైతులను పిలుచుకు రమ్మని వెట్టివారిని పంపిస్తారు. ఒకటి రెండు వాయిదాలు కట్టినా కూడా ఊరుకోరు. ముఖ్యంగా చిన్నరైతులపై వారు ఎక్కువగా సవారీ చేస్తారు. వారు ధనవంతుల జోలికి వెళ్ళరు. ఇదీగాక సెస్సులనీ, జమాబందీ మామూళ్ళనీ, రైతుల నుండి దండిగా వసూలు చేస్తారు. మామూళ్ళు ఇవ్వకపోతే, గండిసాగు అనో, గిండిసాగు అనో ఫైన్‌తో వసూలు చేస్తారు.

రైతులు కష్టపడి పండించిన పంట, వారి నోటివరకూ వచ్చేది కాదు. కమీషన్‌దార్లు, వడ్డీవ్యాపారులు దళారీలు గ్రద్దల్లా, కాకుల్లా, రైతుల చేతిలోంచి నోట్లోంచి తన్నుకుపోయేవారు.

రైతులు కట్టుకోడానికి కూడా వారికి సరిపడ బట్టలుండేవి కావు. రైతు భార్య చీరలు కోసం ఎంతో బాధపడింది. గ్రామాల్లో బట్టల వర్తకులు నాసిరకం వస్త్రాలు రైతులకు అంటకట్టేవారు.

గ్రామాలలోని వర్తకులు చదువరాని రైతులకు దుకాణాలలో అరువులు ఇచ్చి ఇష్టం వచ్చినట్లు పద్దులు రాసుకొని పీడించి వసూలు చేస్తారు. షావుకార్లు నోట్లపై రైతులకు అప్పులు ఇచ్చి, రైతుల నుండి దానిని బెదిరించి వసూలు చేస్తారు.

గ్రామాలలో రైతుల ఆర్థిక పరిస్థితులు దయనీయంగా ఉన్నాయని 'పైపంట' నాటిక ద్వారా తెలుస్తుంది.

## సందర్భ సహిత వాఖ్యలు

**1. ఊరుకోకపోతే, ఉరెట్టుకోమను.**

జ. **కవి పరిచయం :** ఈ వాక్యం నార్ల వెంకటేశ్వరరావుగారు రచించిన 'పైపంట' నాటికలోనిది.

**సందర్భం :** రైతు పంటధాన్యాన్ని కమీషన్‌దారుకు బేరం ఇచ్చి బయానాగా 20 రూపాయలు తెచ్చుకొని ఇంటికి వచ్చాడు. కిస్తీ మూడవ వాయిదా కట్టాలనీ, ఎక్కడా తనకు అప్ప దొరకలేదనీ, మునసబు, కరణాలు పన్ను కట్టమని తనను ఒత్తిడి చేస్తున్నారనీ వెట్టివాళ్ళను పంపిస్తున్నారనీ రైతు భార్యా పుత్రులకు చెప్పాడు.

ఇంతలో మునసబు పంపిన వెట్టివాడు రైతు ఇంటికి వచ్చి మునసబుగారు "నిలుచున్నపాళాన రమ్మన్నారు. ఊరుకోడానికి వీల్లేదన్నారు" అని రైతుకు చెప్పాడు. ఆ మాటలు విన్న రైతుకొడుకు, కోపంతో 'ఊరుకోకపోతే ఉరెట్టుకోమను' అని వెట్టివాడితో అన్న సందర్భంలోనిది.

**అర్థం :** ఊరుకోకపోతే ఉరి వేసుకు చావమను.

**వ్యాఖ్య :** మునసబు చేస్తున్న ఒత్తిడికి విసుగు, కోపం వచ్చి రైతు కొడుకు ఈ మాటలు వెట్టివాడితో అన్నాడు.

**2. పరువూ పోతుంది, పరపతీ పోతుంది.**

**జ. కవి పరిచయం :** ఈ వాక్యం నార్ల వెంకటేశ్వరరావుగారు రచించిన 'పైపంట' నాటికలోనిది.

**సందర్భం :** కిస్తీ కట్టమని, మునసబుగారు రమ్మంటున్నారనీ వెట్టివాడు రైతు ఇంటికి వచ్చాడు. అలాగే వస్తానని రైతు చెప్పాడు. మునసబు, కరణాలు బీదబిక్కి రైతులనే బాగా ఒత్తిడి చేస్తారని కొడుకు అన్నాడు. గత సంవత్సరం కూడా ఈ కరణం, మునసబులు పన్ను కట్టమని చేసిన హడావిడి వల్లే, తక్కువ ధరకు ధాన్యం అమ్ముకున్నామనీ, తర్వాత వారానికే బస్తాకు రూపాయి పావలా పెరిగిందనీ రైతు భార్య గుర్తు చేసింది. కార్తీకం వచ్చే నాటికి ధాన్యం ధర రెట్టింపు అయ్యిందని కొడుకు అన్నాడు.

అప్పుడు రైతు కార్తీకం వచ్చే వరకూ కిస్తీనీ, అప్పుల వాళ్ళనూ ఆపలేమనీ, పంట చేతికి వచ్చే సరికి ఎవరికి రావలసింది వాళ్ళు లాక్కోడానికి వస్తారనీ, కాదంటే పరువూ, పరపతీ పోతుందనీ రైతు, కొడుకుతో చెప్పిన సందర్భంలోనిది.

**అర్థం :** గౌరవం పోతుంది. పలుకుబడి పోతుంది.

**వ్యాఖ్య :** రైతు పరువు, పరపతి నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తున్న సజ్జనుడు.

✲✲✲